www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 15 | ఫిబ్రవరి | 2025 పేజీలు 8

## సారూ.. మా వ్యథ తీర్చండి



మాది పచ్చని పల్లెటూరు మిగిలిన గ్రామాలకు భిన్నంగా వ్యవసాయ భూములకు సమీపంలో ఓ చిట్టడివి అందులో నెమళ్లు ఇతర అటవీ జంతువులు, పక్షులు ఉండేవి. మాపిటేళ అలా పొలానికెళితే నెమళ్లు నాట్యం చేస్తుంటే పరవసించిపోయేవాళ్లం. గుట్టల మీద నుంచి జాలువారే నీళ్లకు సర్కార్ ఒక చెక్‌డ్యాం కట్టింది. పశువులకు, జీవాలకు నీటి కొరత ఉండేది కాదు. పొలంలో పనిచేస్తుంటే అలసట ఉండేది కాదు. అలా సాగుతున్న మా జీవితంలోకి ఓ కుదుపు వచ్చింది. దాదాపు పదేళ్ల పాటు మూతపడిన ఓ ఫ్యాక్టరీ తెరుచుకుంది. మా గ్రామానికి సమీపంలో ఉన్న భద్రాద్రి స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ నుంచి వస్తున్న కాలుష్యం మా పాలిట శాపంగా మారింది. ఫ్యాక్టరీ నుంచి వస్తున్న పొగ కారణంగా మూడు కిలో మీటర్ల మేర పంటలు మసిబారిపోతున్నాయి. ఫ్యాక్టరీ చుట్టూ మసిబారిన చెట్లు, మొక్కలు తప్ప పచ్చని మొక్క కనిపించడం లేదంటే మేము ఎంత ఇబ్బంది పడుతున్నామో తెలుస్తుంది. ఫ్యాక్టరీ నుంచి వచ్చిన కాలుష్యం కారణంగా చెక్‌డ్యాంలోని నీరు విషంగా మారింది. పశువులు తాగితే చనిపోతున్నాయి. జీవాలు, పశువులు గర్భస్రావానికి గురవుతున్నాయి. పంట మొక్కలు మసిబారి కాత, పూత ఉండటం లేదు. కాస్తో కూస్తో పండిన పంటను మసిబారిందన్న కారణంతో దుండుకు సగం అన్నట్లుగా అడుగుతున్నారు. పొలం వైపు వెళ్దామంటే ఒంట్లో వణుకు వస్తుంది. పొలంలోకి దిగి మొక్కలను తాకితే దురద వస్తుంది. ఒళ్లంతా ఒకటే మంట. పొలం పోయి వచ్చి కునుకుతిద్దామంటే గాలి ఆడక నానా ఇబ్బందులు. మాకు ఘోష ఏందని అధికారులను కలిశాం. ఉలుకు పలుకు లేదు. చూద్దామన్నారు కాని చూసినోళ్లు లేరు. హైదరాబాద్ పొల్యూషన్ బోర్డు ఉందంటే అక్కడకు పోయి దరఖాస్తు ఇచ్చినాం. పొల్యూషన్ శాఖ కొత్తగూడెం వాళ్లు పరిస్థితి దారుణంగా ఉంది ఫ్యాక్టరీ మూసివేయాల్సిందేనని రిపోర్టు ఇచ్చారంటా. ఐరన్ ఫ్యాక్టరీ పక్కన ఉన్న కెమికల్ ఫ్యాక్టరీకి పొల్యూషన్ అనుమతులు లేవని చెప్పారు అయినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు సార్ అంటే తప్పకుండా తీసుకుంటాము అన్నారు తప్ప ఎప్పుడో చెప్పలేదు. ఐరన్ ఫ్యాక్టరీతో పొగ, కెమికల్ చెడ్డ వాసన భరించలేక సతమతమవుతున్నాం. ఈ బాధ భరించలేక ఎటైనా పోదామంటే ఉన్న చెలక ఇక్కడే ఉండే. కుటుంబ పోషణ **భారం అవుతుందనుకుంటే రోగాలతో మరింత ఇబ్బందులు పడుతున్నాం..**

సార్ ఒక్కసారి దయచేయండి. గాలి,నీరు కలుషితమై కంటి చూపు తగ్గిపోతుంది. భూమిని నమ్ముకున్నోళ్లం దానిపై ఆధారపడి బతికేటోళ్లం అటు పోకుండా బతకలేం. కనికరించి కాపాడండి. పొగ, చెడ్డ వాసన బంద్ కావాలంటే ఆ ఫ్యాక్టరీలు మూయండి సార్. మీ చర్యలకై ఎదురు చూస్తూ

**ఫ్యాక్టరీల బాధిత రైతులు**
**అప్పలనర్సింహాపురం**
**నేలకొండపల్లి మండలం, ఖమ్మంజిల్లా**

-ప్రజాపక్షం/ఖమ్మం

## డిసిఎం వ్యాన్ బోల్తా..

-ఇద్దరు మృతి, ఎనిమిది మందికి గాయాలు -ముదిగొండ సమీపంలో ఘటన



2 లో

## తాగునీటినందించండి మహాప్రభో..!

- భగీరథ లీకులతో అవస్థలు
-పట్టించుకోని మున్సిపల్ అధికారులు

సెంటర్ స్ప్రెడ్



# ఈ మౌనం దేనికి సంకేతం




-అవినీతి 'కిరణా'లకు అండ ఎవరు....?

-డిపివో, డిఎల్‌పివో పర్యవేక్షణ ఏమైంది

-విషయం తెలుసుకోకుండానే ఆమోద ముద్రలా

**ప్రజాపక్షం/ఖమ్మం :** గ్రామ పంచాయతీల పాలన ప్రత్యేకాధికారుల చేతికి వచ్చి ఏడాది గడిచిపోయింది. అదే సమయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు కొందరు అనుమతుల మొదలు అనేక విషయాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారు ఏది చేసినా జిల్లా అధికారుల పరోక్ష సహకారం ఉంటుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. నిధుల దుర్వినియోగం మొదలు అనేక విషయాలపై జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారి మౌనం పలు అనుమానాలకు తావిస్తుంది. డిపివో, డిఎల్‌పివో, ఎంపివోలు గ్రామ పంచాయతీలలో నిబంధనల ప్రకారం జరుగుతున్నాయో లేదో పర్యవేక్షించాల్సి ఉంది. డిపివో, డిఎల్‌పివో, ఎంపివో ప్రత్యక్ష, పరోక్ష సహకారం లేకుండానే ఖమ్మం రూరల్ మండలం చిన్నవెంకటగిరిలో భారీ అవినీతి జరిగిందా అన్నది తేలాల్సి ఉంది. ఒకే రోజు గ్రామ పంచాయతీ కార్యదర్శి 44 ఇండ్లకు ఇంటి నెంబర్లు కేటాయించినా, 45 రోజుల్లో 181 ఇండ్లకు ఇంటి నెంబర్లు కేటాయించడంతో పాటు 40 ఇండ్లకు మ్యూటేషన్ పూర్తి చేసినా ఏ అధికారి ఆ వైపు కన్నెత్తి చూడలేదంటే ఎంతగా మమేకమయ్యారో

మిగతా 2లో..



# ఈ మౌనం దేనికి సంకేతం

**(మొదటిపేజీ తరువాయి)**

అవగతం అవుతుంది.

సామాన్యులు ఇంటి నిర్మాణానికి అనుమతికో, ఇంటి నెంబర్ కేటాయింపు కోసమో దరఖాస్తు చేస్తే మీ సేవ ఆ సేవ అంటూ తిప్పే అధికారులు చిన్న వెంకటగిరిలో జరిగిన దానిపై కనీస విచారణ ఎందుకు చేపట్టలేదన్నది అసలు ప్రశ్న. ప్రజాపక్షం ఇంటి నెంబర్ల కేటాయింపులో జరిగిన అవినీతిపై వార్తను ప్రచురించకుంటే అంతా సర్దుబాటు అయ్యేదేగా అని ప్రజల నుంచి వస్తున్న ప్రశ్న. నియమ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ఇష్టానుసారంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి వ్యవహరించిన తీరుపై ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండిపడింది. ఇందులో పాలుపంచుకున్న వారు జేబులు నిండాయి తప్ప ప్రభుత్వ ఆదాయానికి మాత్రం చిల్లు పడింది.

ఇంటి నెంబర్లు కేటాయించాలంటే మీ సేవ ద్వారా స్థలం కాగితాలు, ఈసి, భవన నిర్మాణ అనుమతి ధృవీకరణ, భవన నిర్మాణ ప్లాన్‌తో దరఖాస్తు చేయాలి. మీ సేవ ద్వారా గ్రామ పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేరినప్పుడు అసలు ధృవపత్రాలు పరిశీలించి దరఖాస్తులో ఉన్నది క్షేత్రస్థాయిలో కూడా అదేవిధంగా ఉందో లేదో స్వయంగా పరిశీలించాలి. నోటీస్‌బోర్డులో పెట్టిన వారం తర్వాత అభ్యంతరాలు లేకపోతే అప్పుడు నెంబర్ కేటాయించాలి. అసలు ఈ తంతు జరగకుండానే ఇంటి నెంబర్లు కేటాయిస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నట్లు...? ఇల్లు లేని ఖాళీ స్థలానికి ఇంటి నెంబర్ కేటాయించడంతో గ్రామ పంచాయతీ రికార్డుల ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని లేని ఇంటికి రుణం పొందే అవకాశం ఉంది. దీనిని ఎవరు నిలువరిస్తారు.

**ఇంటి పన్నుకు భారీ గండి :**

ఇంటి స్థలం విలువ, నిర్మాణం ఖర్చు, తరుగుదల ఇలా అన్నింటిని లెక్కించి మొత్తం విలువలో 0.20 శాతాన్ని ఇంటి పన్నుగా నిర్ధారించాలి. కానీ చిన్న వెంకటగిరిలో ఇష్టానుసారంగా ఇంటి నెంబర్లను కేటాయించడంతో పాటు ఇంటి పన్ను విషయంలోనూ భారీ అవకతవకలు జరిగినట్లు తెలుస్తుంది. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారన్న ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు. చిన్నవెంకటగిరి అవినీతి కిరణాలకు అంద ఎవరన్న దానిపై విస్తృత చర్చ సాగుతుంది. ఓ పంచాయతీ కార్యదర్శి పై అధికారులకు కనీసం సమాచారం ఇవ్వకుండానే ఇంత పెద్ద తప్పిదానికి పాల్పడి ఉండి ఉంటే అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు. చిన్నవెంకటగిరిలో జరిగిన భారీ అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది. జిల్లాలోని ఒక మేజర్ గ్రామ పంచాయతీలో రెండు కోట్ల రూపాయలు సొంత ఖాతాల్లోకి జమ చేసుకున్నా జిల్లా అధికారులు మౌనంగానే ఉన్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

# డిసిఎం వ్యాన్ బోల్తా..



**ప్రజాపక్షం/ముదిగొండ :** ఖమ్మం కోదాడ జాతీయ రహదారిపై ముదిగొండ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదం లో ఇరువురు మృతి చెందగా మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం గువ్వల గూడెం లో ఓ గ్రానైట్ ఫ్యాక్టరీ నుంచి డీసిఎం వాహనం లో గ్రానైట్ పాలిష్ రాళ్ళను ఖమ్మం తరలిస్తుండగా ముదిగొండ సమీపంలో ఖమ్మం కోదాడ జాతీయ రహదారిపై డీ సిఎం వాహనం వీల్ బోల్ట్ విరిగి బోల్తా కొట్టింది. దీంతో డీ సిఎం వాహనం లో ఉన్న గ్రానైట్ పాలిష్ రాళ్ళ మీద పడి గుండాల మండలం కొమరారం గ్రామానికి చెందిన బాణోతు హుస్సేన్ (30) దోర్నకల్ మండలం అన్నారం గ్రామానికి చెందిన గుగులోతు వీరన్న (35) అనే ఇరువురు వ్యక్తులు మృతి చెందారు. వీరితోపాటు వాహనం లో ఉన్న ఖమ్మం పట్టణం హవేలీ ఖానాపురం కు చెందిన రామదాసు, కర్ణ, కుమార్, సుందర్, రవి, వినోద్, వీరన్న, అశోక్ అనే వ్యక్తులకు గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పోలీసులు ఖమ్మం ప్రభుత్వాసుపత్రి కి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గ్రామాల్లో పట్టు తప్పిన పారిశుద్ధ్యం

**-గ్రామ పంచాయతీల ముందే బహిరంగ మల విసర్జన**
**-పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు**





**ప్రజాపక్షం/కూసుమంచి :** మండలం లోని 41 గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం పట్టు తప్పిపోయిందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. వివరాల్లోకొస్తే కూసుమంచి మండలం లోని 41 గ్రామ పంచాయతీ లు 64 చివర్లలో మొత్తం గ్రామాల్లో గతంలో ఉన్న పారిశుద్ధ్యానికి భిన్నంగా నేడు అస్తవ్యస్తంగా నడుస్తుందని చెప్పవచ్చు ప్రతి గ్రామంలోకి వెళ్తుంటే ఆరు బయట మలవిసర్జన స్వాగత దర్శనమిస్తుంది. ఈ పరిస్థితి అధికారుల పనితీరుకు అద్దం పడుతుంది. గత కొన్ని సంవత్సరాల క్రితం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అన్ని గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దటంలో పెద్ద పోరాటమే చేసిందని చెప్పవచ్చు దానిని ఒక రూట్లో తీసుకురాటానికి శతవిధాల పడిన తీరు వర్ణాతీతం అటువంటి పనిలో ఐఏఎస్ అధికారుల దగ్గర నుండి గ్రామ పంచాయతీ కార్యదర్శులు వరకు ఎంతో అవిరాల శ్రమ ఉన్నది అది నేడు కాస్త పరిపాలనలో అధికారుల నిర్లక్ష్యానికి గురై మళ్లీ పాత పద్ధతుల్లోకే వస్తు గ్రామాలను మరింత అగాధములోకి నెట్టే ప్రమాదం కనిపిస్తోంది.

**పొంచి ఉన్న రోగాల ప్రమాదం...**

ఇప్పటికే పక్క రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వ్యాధితో మరణాలు సంభవిస్తుంటే ఇక్కడ మాత్రం బహిరంగ మలవిసర్జన తో ప్రజలకు వ్యాధులు ప్రమాదం శోక వచ్చును అది ఎంతో దూరం లేదనిపిస్తోంది. ఏ గ్రామంలో చూసిన స్త్రీల కంటే ఎక్కువగా పురుషులే తెల్లవారుజామున ఆరు బయట మలవిసర్జన చేస్తూ గ్రామ ప్రజల, పిల్లల రోగాలకు కారణంగా మారుతున్నారు.

**గ్రామ పంచాయతీల ముందే బహిరంగ మలవిసర్జన...**

ఒకప్పుడు గ్రామాల్లో ఆరు బయట మలవిసర్జన చేయాలంటే గ్రామపంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీ సిబ్బందికి భయపడిన ప్రజలు నేడు వారి ఉనికి ఏ మాత్రం లేకపోవడంతో సదరు వ్యక్తులే కూసుమంచి మండలంలోని ఊరు పక్కన ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయాల ముందే బహిరంగ మలవిసర్జన చేస్తున్నారంటే ఆ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల పనితీరు ఏ విధంగా ఉందో చెప్పవచ్చును ఒకప్పుడు బహిరంగ మలవిసర్జన చేసిన వారికి జరిమానాలు విధించిన కార్యదర్శులు నేడు ఆ పద్ధతిలో వ్యవహరించకపోవడం వల్లనే సాక్షాత్తు పంచాయతీల ముందే మలవిసర్జన చేస్తున్నారు. ఈ అంతటికి కారణం వైఫల్యం అయిన పని విధానానికి అద్దం పడుతుంది.

**పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు..**

కార్యదర్శులు పారిశుద్ధం నిర్వహించడంలో ఎటువంటి పట్టింపులు లేకుండా వ్యవహరిస్తున్నారని పలు గ్రామాల్లో విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక గ్రామంలో వ్యర్థాలను (కొబ్బరి బోండాలు, చికెన్ వ్యర్థాలు,) ఆ గ్రామంలోని డంపింగ్ యార్డ్ లో వద్ద వేయకుండా గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించకుండా ఊరు పొలిమేరలో మరో గ్రామానికి సమీపంలో వేయడం వలన వాహనదారులకు కూడా ఇబ్బందిగా మారుతుంది. డంపింగ్ యార్డ్ సిస్టం కూడా విస్మరిస్తున్నారని ప్రజలకు అర్థమవుతుంది. ఇప్పటికైనా కార్యదర్శులు ఈ పద్ధతి మార్చాలని మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు కోరుతున్నారు.

**విధుల పట్ల పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం**

మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు తమ విధుల పట్ల ఎంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు అంటున్నారు. కొత్తగా పంచాయతీ కార్యదర్శులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వారు గ్రామాల్లో నివసించకుండా సమయపాలనకు కార్యాలయాన్ని తెరవకుండా ఇంకా పాత కార్యదర్శులు పెట్టిన ఫోన్ నెంబర్ ప్లేట్లను తొలగించకుండా ఎంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విధులు నిర్వహిస్తున్నారని ఏదో వచ్చామంటే వచ్చాము పోయామంటే పోయాము అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎవరైనా ఇదేమిటని అడిగితే మాకు వేరే బాధ్యతలు ఇచ్చారు, మాకు ఎన్నికల పనులు ఉన్నాయి. మేము సర్వేలో ఉన్నాము. అంటూ రకరకాల కారణాలతో దాటవేత వేస్తూ బాధ్యతా యుతంగా వ్యవహరించడం లేదని అంతా బాధ్యతారాహితంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**ఉన్నతాధికారుల వైఫల్యం అస్తవ్యస్త పారిశుద్ధ్యం..**

కూసుమంచి మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడానికి మండల స్థాయి ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన బహిరంగ మలవిసర్జన డంపింగ్ యార్డులను సక్రమంగా ఉపయోగించుకొని స్థితి ఏర్పడుతూ ఒక గ్రామం వ్యర్థాలను మరో గ్రామ సమీపంలో పడవేస్తున్నారని మండలం లోని ప్రజలు చర్చించుకుంటున్నారు ఈ పద్ధతిని ఇప్పటికైనా ఉన్నతాధికారులు చక్కదిద్దాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**ఎంపీడీ రామచంద్రరావు వివరణ...**

కూసుమంచి మండలంలో బహిరంగ మలవిసర్జన అస్తవ్యస్త పారిశుద్ధ్య నిర్వహణపై మండల పంచాయతీ అధికారి రాంచంద్రరావును ప్రజా పక్షం విలేఖరి వివరణ కోరగా ఒకసారి పంచాయతీ కార్యదర్శులు అందరితో సమావేశం నిర్వహించి పారిశుద్ధం పట్ల అందరిని అప్రమత్తం చేస్తామని తెలిపారు.

# కుంచపర్తి ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాషా దినోత్సవం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** వేంసూరు మండలం కుంచపర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, టీచింగ్ , లెర్నింగ్ మెటీరియల్ మోడల్స్‌ను తయారు చేయడంలో పోటీలను నిర్వహించారు. విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ లాల్ మహమ్మద్ మాట్లాడుతూ భారత కోకిల సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆమె జయంతి రోజును ఆంగ్లభాష దినోత్సవంగా ప్రతి సంవత్సరం జరుపుకోవాలని సూచించడంతో, పాఠశాలలో ఆంగ్ల భాషా దినోత్సవం నిర్వహించామని తెలిపారు. ఆంగ్ల భాష నేర్చుకోవడం వలన విద్యార్థులు కమ్యూనికేషన్స్ పెంచుకుని భవిష్యత్తు జీవితాన్ని తీర్చిదిద్దుకోగలుగుతారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆంగ్లభాష ఉపాధ్యాయులు బసిహెచ్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఏ.వెంకటేశ్వరరావు, పి కృష్ణయ్య, సిహెచ్ వి సత్యవతి , జి రామకృష్ణ, టి ముత్తారావు, షేక్ దస్తగిరి, జి శివ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మగౌరవం కోసమే సభ



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** గ్రామీణ వైద్యులు ఆత్మగౌరవం కాపాడుకోవటం కోసమే ఈ నెల 18న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆర్ఎంపి, పిఎంపి వైద్యులు సంఘం జిల్లా అధ్యక్షులు సత్యవరపు జగదీష్ స్పష్టం చేశారు. గత ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆత్మగౌరవ సభ గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యం పరిరక్షణలో గ్రామీణ వైద్యుల పాత్ర అత్యంత కీలకమని, అటువంటి గ్రామీణ వైద్యులకు శిక్షణనిచ్చి సర్టిఫికెట్లు జారీ చేస్తానని ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి ప్రకటించినట్లు గుర్తు చేశారు. ఇప్పటికే శిక్షణ పూర్తి చేసిన 13వేల మంది గ్రామీణ వైద్యులకు ప్రభుత్వ ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని, దరఖాస్తు చేసుకున్న మిగిలా గ్రామీణ వైద్యులకు ఆరు నెలల్లో శిక్షణనివ్వాలని సూచించారు. గ్రామీణ వైద్యులపై పెట్టిన కేసులను కొట్టివేసి భవిష్యత్‌లో దాడులు నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం బాధ్యులు టిక్కస్వారావు. వేల్పుల సత్యనారాయణ, ఎస్.చంద్రశేఖర్, ప్రేమ్‌సాగర్, ఎస్.రమేష్, సిలారు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని పెద్దతండ సబ్‌స్టేషన్ ఫీడర్ మెయింటెనెన్స్‌లో భాగంగా నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని, కోతులగుట్ట సబ్‌స్టేషన్ ఏఈ జిల్లా ప్రభాకర్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాయుడుపేట, సాయిప్రభాత్‌నగర్, టీచర్స్‌కాలనీ, బిబిఎన్‌స్మార్ట్‌రోడ్, ఆర్ఎస్ఎస్‌నగర్, చైతన్యనగర్‌తో పాటు పెద్దతండా పంచాయతీపరిధిలోని పలు ప్రాంతాలలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలకు వరకు అంతరాయం కలగనుందని, గృహ, ఇండస్ట్రియల్ వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# విధుల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలి



**-ఉద్యోగులు ఒత్తిడి లేకుండా పనిచేయాలి**
**-నూతన చాంబర్‌లను ప్రారంభించిన కలెక్టర్**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ నిర్దిష్టమైన సేవలను ప్రజలకు సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆరు రెవెన్యూ విభాగ పర్యవేక్షకుల కోసం ఏర్పాటు చేసిన నూతన చాంబర్‌లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌కు ప్రజలు తమ సమస్యల పరిష్కారమవుతాయనే నమ్మకంతో వస్తారని వారి పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తూ సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. నిర్దిష్టమైన సేవలను ప్రజలకు సకాలంలో అందించాలని అధికారులు బాధ్యతాయుతంగా జవాబుదారితనంతో పని చేయాలన్నారు. ఒక దరఖాస్తు పరిష్కారం మన చేతిలో లేని పక్షంలో ఆ సమస్యకు పరిష్కారం ఎలా దొరుకుతుందో అవసరమైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. ఉద్యోగస్తులకు జిల్లా కలెక్టరేట్‌లో అవసరమైన వసతులు ఒక్కొక్కటిగా కల్పించడం జరుగుతుందన్నారు. ఉద్యోగులు ఒత్తిడి లేకుండా పనిచేయాలని అనవసరంగా ఒత్తిడికి గురైతే మన పనితీరుపై ప్రభావం పడుతుందని తెలిపారు. ఒత్తిడి లేకుండా పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ.పద్మశ్రీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో ఎన్. అరుణ, వివిధ సెక్షన్ల పర్యవేక్షకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు



**ప్రజాపక్షం/చింతకాని :** మహా శివరాత్రి సందర్భంగా నేరడ గ్రామంలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిఏటా రెండు రాష్ట్రాల స్థాయిలో కబడ్డీ పోటీలు ఏర్పాటు చేయడం ఆనవాయితీ . ఈక్రమంలో ఈనెల 26 నుంచి 28 వరకు కబడ్డీ పోటీల ఏర్పాటు కోసం నేతాజీ యువజన సంఘం కార్యదర్శి దూసరి గోపాలరావు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ శాఖ కార్యదర్శి మట్టా రవి, నాయకులు పెరిక ప్రభాకర్,పగిళ్లపల్లి రంగయ్య, కనకపుడి బాబు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ బాలాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సర్వేంద్రియానాం నయనం ప్రధానం అని కంటి చూపు లేకపోతే ఈ సృష్టి శూన్యమని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి తెలిపారు. అటువంటి చూపును పదిలంగా కాపాడుకోవాలని కోరారు. శ్రీ బాలాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాసన్ ఐకేర్ సౌజన్యంతో శుక్రవారం ఖమ్మంలోని శ్రీ బాలాజీ కార్పొరేట్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొని వత్సవాయి రవి కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సు పెరుగుతున్న కొద్దీ కంటి చూపు మందగించడం సర్వ సాధారణమన్నారు. 40 ఏళ్ల వయస్సు దాటిన తర్వాత ఏడాది ఒకసారైనా కంటి వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరమని తెలిపారు. చూపు మందగించకుండా ఉండటానికి ఎ విటమిన్ కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో 400 మందికి కంటి పరీక్షలు చేశారు. అదేవిధంగా బిపి, షుగర్ వంటి పరీక్షలు చేశారు.ఈ కార్యక్రమంలో కొణిజర్ల మాజీ ఎంపిపి గోసు మధు, ఆఫీస్, మార్కెట్ సిబ్బంది , వాసన్ ఐకేర్ సిబ్బంది అఫ్సర్, వెంకటేష్, గోపి, చందు, తేజస్విని పాల్గొన్నారు.

# సర్వేలో మున్నూరుకాపు జనాభా తప్పుడు లెక్క

**-హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలి**
**-మున్నూరుకాపు సంఘం నేతలు**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కుల గణన సర్వేలో 22 శాతం ఉన్న మున్నూరుకాపు కుల జనాభాను మూడున్నర శాతం తక్కువగా చూపించారని దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, జిల్లా అధ్యక్షులు పారా నాగేశ్వరరావు లు తెలిపారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల పైచిలుకు ఉన్న మున్నూరుకాపు జనాభాను సర్వేలో 14లక్షలు అని తక్కువగా చూపించడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో 28 లక్షలని కానీ ప్రస్తుత ప్రభుత్వం 14 లక్షలు చూపించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే రీ సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సర్వేను వ్యతిరేకిస్తూ త్వరలో హైదరాబాద్ పరేడ్ మైదానంలో రాజకీయ పార్టీలకు అతీతంగా బహిరంగ సభను నిర్వహిస్తున్నామని దానిని విజయవంతం చేయాలని కోరారు. రీ సర్వే నిర్వహించాలని కోరుతూ ఈనెల 17న ఆయా జిల్లా కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు అందించాలని వారు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పసుపులేటి దేవేందర్, ట్రస్టు బోర్డు అధ్యక్షులు మేకల బిక్షమయ్య, మారిశెట్టి వెంకటేశ్వరరావు, మానుకోట సత్యనారాయణ పాల్గొన్నారు.

# రేపు నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం సమావేశం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఖమ్మంజిల్లా కార్యవర్గ సమావేశం ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి కాంపాటి వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు సంఘం జిల్లా అధ్యక్షులు జి.బిక్కు అధ్యక్షతన ఇందిరానగర్‌లోని సంఘం కార్యాలయంలో జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఇండ్ల స్థలాలు, మహిళా దినోత్సవం, ప్రమోషన్లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, వసతి గృహాల్లో నియమకాలు, ఖమ్మం కార్పోరేషన్, ఆరోగ్య శాఖలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి సిపిఎస్ రద్దు, ఇతర అంశాల గురించి చర్చించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధ్యక్ష, కార్యదర్శులు, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, నగర శాఖ సభ్యులు, సొసైటీ సభ్యులు, మహిళా ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

# ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

**-మహిళ కడుపులో ఐదు కేజీల కణితి తొలగింపు**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రైవేటు ఆసుపత్రులకే పరిమితమైన అరుదైన శస్త్ర చికిత్సను ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో విజయవంతంగా నిర్వహించారు. మహిళ కడుపులో ఉన్న ఐదు కేజీల కణితిని శుక్రవారం శస్త్ర చికిత్స నిర్వహించి తొలగించారు. వివరాల్లోకి వెళితే… సూర్యాపేటజిల్లా కోదాడకు చెందిన డి. సుశీల అనే మహిళ తీవ్రమైన కడుపునొప్పి, కడుపు ఉబ్బరం, ఆయాసంతో బాధపడుతూ ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రానికి వచ్చింది. ఆమెను పరీక్షించిన వైద్యులు స్కానింగ్ చేశారు. ఆమె కడుపులో కణితి ఉందని శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. హెచ్‌వోడీ డాక్టర్ యామిని ఆధ్వర్యంలో వైద్యులు అపర్ణ, రాధిక, శ్రీవిద్య,రిషిక లు సుశీలకు శస్త్ర చికిత్స నిర్వహించి ఆమె కడుపులో ఉన్న ఐదు కేజీల కణితిని తొలగించారు. ప్రైవేటు ఆసుపత్రులకే పరిమితమైన ఇటువంటి క్లిష్టమైన శస్త్ర చికిత్సను ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మొట్టమొదటి సారిగా విజయవంతంగా నిర్వహించినందుకు వైద్య బృందాన్ని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్, ఆర్‌ఎంవో డాక్టర్ రాంబాబు లు అభినందించారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలను ప్రజలకు అందిస్తున్నట్లు వారు తెలిపారు.

# అనుమానాస్పదస్థితిలో గొర్రెలు, మేకలు మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** అనుమానాస్పదస్థితిలో 16 గొర్రెలు, మేకలు మృతి చెందిన సంఘటన ఖమ్మంరూరల్ మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల ఆటోనగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. కాపరులు తెలిపిన వివరాల ప్రకారం…గుర్రాలపాడుకు చెందిన బుర్ర వెంకన్న, దొడ్డ ఉపేందర్, దొడ్డ వీరభద్రమ్ తమ గొర్రెలు, మేకలను మేపేందుకు అటువైపు వచ్చారు. ఈ క్రమంలో అక్కడి ఎన్ఎస్‌పీ కెనాల్‌లో నీరు తాగి అవి మృత్యువాత పడ్డాయి. కాగా వీటి విలువ సుమారు రూ.2లక్షల40వేలు ఉంటుందని, వారు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ నాయకుల భూక్య సురేష్‌నాయక్ ఘటన స్థలం వద్దకు వెళ్లి పరిశీలించి, కాపరులకు ధైర్యం చెప్పారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి దృష్టికి సైతం తీసుకువెళ్లారు. ఫోన్ ద్వారా అక్కడి నుంచే వెటర్నటి డాక్టర్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వచ్చిన వారు పోస్టుమార్టం చేసి, పంచనామా చేశారు. మృతి వివరాలను రిపోర్ట్ వచ్చిన తర్వాత వెల్లడిస్తామని, తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ డైరెక్టర్ ఎన్‌పీ చారి, మద్దులపల్లి మార్కెట్ డైరెక్టర్ భద్రకాళి, నాయకులు బొల్లం వెంకన్న, శేషిరెడ్డి, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో వంద పడకల హాస్పిటల్ పనులు ప్రారంభం






**ప్రజాపక్షం/వైరా:** వైరాలో 100 పడకల హాస్పిటల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులు చకచకా కొనసాగేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 09.08.2024న తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌తో కలిసి హాస్పిటల్ నిర్మాణం కోసం శిలాఫలకాన్ని ప్రారంభించారు. తెలంగాణ వైద్యవిధాన పరిషత్ 20232024 సంవత్సరం నిధులు క్రింద హాస్పిటల్ నిర్మాణం కోసం రూ.37.50కోట్ల నిధులు కేటాయించారు. ప్రస్తుతం వైరాలో ప్రారంభమైన 100 పడకల హాస్పిటల్‌నిర్మాణం రూ.26 కోట్ల వ్యయంతో పనులు జరుగుతున్నాయి. ఎన్నో సంవత్సరాల నుండి నియోజకవర్గ ఏంద్రంలో వంద పడకల హాస్పిటల్ కోసం ప్రజలు ఎదురుచూశారు. ఇప్పుడు ఆ వంద పడకల హాస్పిటల్ నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. వైరాలో వంద పడకల హాస్పిటల్ నిర్మాణం ఎంతో అవసరం. ఇప్పుడు ఆ నిర్మాణం పనులు జోరుగా కొనసాగుతున్నాయి. భవన నిర్మాణానికి కావాల్సిన ఐరన్ సిమెంట్‌తో పాటు ఇతర సామాగ్రిని తీసుకొచ్చారు. ఇంజనీర్లు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

# వైరా సొసైటీలో 1704 మందికి రుణమాఫీ



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా వైరా సొసైటీలో 2904 మంది రైతులు బ్యాంకులో లోన్ తీసుకుంటే 1704 మంది రైతులకు రుణమాఫీ వచ్చిందని వైరా సొసైటీ సెక్రటరీ బొల్లం రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వైరా సొసైటీ పరిధిలోని 1704 మంది రైతులకు రుణమాఫీ వచ్చిందని వారికి మెసేజ్‌లు కూడా పోయాయని, రుణమాఫీ పొందిన ప్రతి రైతులకు సమాచారాన్ని తెలియపరుస్తున్నామని అన్నారు. రైతులు పూర్తి వివరాలకు సొసైటీ అధికారులను కలవాలని సూచించారు. అదేవిధంగా రుణమాఫీ కోసం ఈసి అవసరం లేదని, కేవలం ఆధార్‌కార్డ్, పాస్ బుక్, 1బి, ఫొటోలు బ్యాంకులో ఇస్తే సరిపోతుందని అన్నారు.

## రాజేశ్వరపురంలో నిఘా నేత్రాల ఏర్పాటుకు కృషి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : నేరాల నియంత్రణ కోసం సీసీ కెమేరాల ను ఏర్పాటు చేసేందుకు రాజేశ్వరపురం సోసైటీ మాజీ చైర్మన్ దండా ప్రవీణ్ ముందుకు వచ్చారు. మండలం లోని రాజేశ్వరపురం పంచాయతీలో సీసీ కెమేరాల ను ఏర్పాటు చేయాలని స్థానికులు, పోలీసులు కోరటంతో అంగీకరించారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ యర్రబోయిన నర్సయ్య ఆధ్వర్యంలో కెమేరాల ఏర్పాటు చేసే పాయింట్ల ను శుక్రవారం గుర్తించారు. గ్రామం మొత్తం 8 పాయింట్ల ను గుర్తించారు. 8 కెమేరాల ఏర్పాటు కు అవసరమైన ఖర్చు మొత్తం తాను భరిస్తానని ప్రవీన్ హామీ ఇచ్చారు. ఈ మేరకు పనులు ప్రారంభించారు. గ్రామ అవసరాల రీత్యా సీసీ లు ఏర్పాటు కు సహకరిస్తున్న ప్రవీణ్ ను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చిట్యాల రమేష్, ఇస్లావత్ బాలాజీ, యం.సుధీర్, దూదిపాల సైదులు పాల్గొన్నారు.

## డిజిటల్ క్రాప్ సర్వేను వేగవంతం చేయండి



ప్రజాపక్షం/సత్తుపల్లి: జిల్లా వ్యాప్తంగా డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిదిలోని రేజర్ల గ్రామంలో జరుగుతున్న డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను సహాయ వ్యవసాయ సంచాలకులు వి.శ్రీనివాసరెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 2,42,267 ఎకరాలను లక్ష్యంగా నిర్దేశించిందని, దానికి గాను 99.107 ఎకరాలను ఇప్పటి వరకు పూర్తి చేసామని తెలిపారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ యసంగిలో జిల్లా వ్యాప్తంగా ఆయ సహకార సంఘాల పరిధిలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏడిఏ వి. ఐశ్రీనివాస రెడ్డి, మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఏఈఓ టి.నరేష్ పాల్గొన్నారు.

## దళిత అధికారులను టార్గెట్ చేస్తే ఊరుకో..

ప్రజాపక్షం/జూలూరుపాడు: దళిత అధికారులను టార్గెట్ చేస్తే ఊరుకునేది లేదని, ఎమ్మార్పీఎస్ కు పోరాటాలు కొత్త ఏమి కాదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు దిబ్బెందుల సాయికుమార్ అన్నారు. శుక్రవారం జూలూరుపాడులో పత్రిక విలేకరుల సమావేశంలో సాయికుమార్ మాట్లాడుతూ మండలంలో మా దళిత అధికారులను టార్గెట్ చేస్తున్నారని, కొందరు వ్యక్తులు ప్రైవేట్ వ్యక్తులతో బురద చల్లాలని ప్రయత్నం చేస్తున్నారని, ఆధిపత్యం కలిగిన వ్యక్తులు ఎవరైనా సహించేది లేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా దళిత ఉద్యోగస్తులపై టార్గెట్లు, ఒత్తిళ్లు మానుకోకపోతే ఎమ్మార్పీఎస్ తరపున మండల వ్యాప్తంగా ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు.

## డార్విన్ పరిణామ క్రమంపై అవగాహన సదస్సు



ప్రజాపక్షం/జూలూరుపాడు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జూలూరుపాడులో పాపకొల్లు రోడ్డు నందుగల సాయి ఎక్సలెంట్ స్కూల్లో డార్విన్ పరిణామ క్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక బాధ్యులకు ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో లాయర్ మక్కడ మాట్లాడుతూ పిల్లలలో ముఢనమ్మకలు తొలగిపోయే బావి భారత పౌరులుగా నేటి తరానికి బంగారు భవిష్యత్తు ఏర్పడేలా చెయ్యాలని ఆయన వివరించారు. పాఠశాల ప్రిన్సిపల్ అరెబోయిన కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యార్థులను చైతన్య వంతులుగా తీర్చి దిద్దే విధంగా మంచి విద్యని అందిస్తూ భట్టి పట్టి చదివే విధానంను పిల్లలలో తొలగించి లెసెన్స్ పై అవగాహన వచ్చే విధంగా యోగ కార్యక్రమాలు మరియు ఆటలు పాటలు, కో సర్క్యులర్ కార్యక్రమాలు పాఠశాలలో నిర్వహిస్తూ ప్రతి విద్యార్థిలో మానసిక ఉల్లాసం పెంచేలా చెయ్యడమే మా కర్తవ్యం గా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యురాలు ఏ.కస్తూరి, జేవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. మోహన్ రావు, జేవివి జిల్లా శాఖ సెక్రెటరీ సీహెచ్. తిరుమల పాలు తదితరులు పాల్గొన్నారు.

## జమలాపురం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న తల్లాడ కాంగ్రెస్ నేతలు



ప్రజాపక్షం/ తల్లాడ : ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామిని తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నేతలు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామికి వారు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మారెళ్ళ మల్లికార్జున్‌రావు, వడ్డే రామారావు, పగడాల లచ్చిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ గోవింద శ్రీనివాసావు, నీలాద్రి ఆలయ డైరెక్టర్ దగ్గుల నాగిరెడ్డి, మాజీ ఎంపిటిసి తాళ్ల జోసెఫ్, మేడి కృష్ణ పాల్గొన్నారు.

# రక్త పరీక్షల పేరుతో దోపిడీ..!

-మొలల హాస్పిటల్‌లో సంబంధాలు
-జిల్లాలో అనుమతి లేని రక్త పరీక్ష కేంద్రాలు
-అర్హతలు లేకపోయినా రక్త పరీక్షలు
-కనిపించని వైద్యశాఖ తనిఖీలు





ప్రజాపక్షం/వైరా: వైద్య పరీక్షల పేరుతో ప్రజల రక్తాన్ని కొన్ని రక్త పరీక్ష కేంద్రాల నిర్వాహకులు డబ్బులు రూపంలో ప్రజల రక్తాన్ని పీలుస్తున్నారు. అందిన కాడికి దోచుకుంటున్నారు. కొంతమంది రక్త పరీక్షల నిర్వాహకులు ఇచ్చే రిపోర్ట్‌లలో నాణ్యత లేదని తప్పులు వస్తున్నాయని ఆరోపణ వినిపిస్తున్నాయి. 10 పాస్ అయితే చాలు ఎవరైనా రక్త పరీక్ష కేంద్రాలు పెట్టుకోవచ్చు. రక్త పరీక్షలు నిర్వహించవచ్చు అనే విధంగా కొన్ని చోట్ల రక్త పరీక్ష కేంద్రాల పనితీరు కనిపిస్తుంది. వైద్యశాఖ నుండి ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున జిల్లాలో రక్త పరీక్ష కేంద్రాలు నిర్వహణ కొనసాగుతుంది. కొన్ని మండలాల్లో కొన్ని ప్రాంతాల్లో కొంతమంది రక్త పరీక్ష కేంద్రాల నిర్వాహకులు ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న మొలలు కేంద్రాలతో సంబంధాలు ఏర్పాటు చేసుకొని మొలలు ఆసుపత్రికి వచ్చిన వారికి టెస్ట్‌ల పేరుతో వేల రూపాయలు వారి నుంచి గుంజుకుంటున్నారు. టెస్ట్‌లలో పర్సంటేజ్‌ల పేరుతో సరికొత్త దందా కొనసాగిస్తున్నారు. సగటు రోగి వైద్యులకు చూపించుకున్న దాని కంటే పరీక్షలకే ఎక్కువగా ఖర్చులు వస్తున్నాయి. కొంతమంది ఇస్తున్న రక్త పరీక్ష రిపోర్టులు సక్రమంగా ఉండటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. షుగర్ టెస్ట్‌ల పేరుతో పెద్ద ఎత్తున రక్త కేంద్రాలు ఏర్పాటు చేసి షుగర్‌కు సంబంధించి పరీక్షలు చేయబడునని బోర్డులు పెట్టి ఎలాంటి అనుతులు లేకుండానే రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. షుగర్ వ్యాధిని ఆసరాగా చేసుకొని టెస్ట్‌ల పేరుతో భారీగా దోచుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడ కూడా రక్తపరీక్ష కేంద్రాలపై తనిఖీలు నిర్వహించిన సందర్భాలు కనిపించడం లేదు. ఎందుకంటే కొన్ని చోట్ల సంబంధం లేకపోయినా కూడా రకరకాల పరీక్షలు వ్రాసి అమాయక ప్రజలు జేబులు ఖాళీ చేస్తున్నారు. అసలు జిల్లాలో ఎన్నిచోట్ల రక్త పరీక్ష కేంద్రాలకు అనుమతులు ఉన్నాయి. ఎంతమంది రక్త పరీక్షలు చేసే అర్హత కలిగిన వారు నిర్వహిస్తున్నారు. ఎంతమందది అర్హత లేని వారు కూడా రక్త పరీక్ష కేంద్రాలను నిర్వహిస్తున్నారు. దీనిపై దృష్టి సాధించాల్సిన వైద్యశాఖ అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు. ప్రతి మండలంలో ప్రతి గల్లీలో రక్త పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల రక్తాన్ని డబ్బులు రూపంలో పీల్చేస్తున్నారు. రక్త పరీక్ష కేంద్రాల్లో కొన్నిచోట్ల బిల్లులు లేకుండానే డబ్బులు తీసుకుంటున్నారు. వాస్తవంగా రక్త పరీక్ష కేంద్రం నందు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలి. ఆ బల్లు వైద్యశాఖకు అనుసంధానంగా ఉండాలి. కాని వైట్ పేపర్ల మీద రక్త పరీక్ష కేంద్రంలో బిల్లులు ఇచ్చి ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య అధికారులు జోక్యం చేసుకొని అనుమతి లేని రక్త పరీక్ష కేంద్రాలపై తనిఖీలు నిర్వహించి వాటిపై చర్యలు తీసుకొని నాణ్యమైన పరీక్షలు అన్ని అర్హతలు ఉన్న పరీక్ష కేంద్రాలను ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా చూడాలి.

# శివపార్వతుల కళ్యాణానికి వేళాయే..!

- శివరాత్రికి సర్వం సిద్ధం
-శివాలయాల్లో కొనసాగనున్న ప్రత్యేక పూజలు





ప్రజాపక్షం/పినపాక: మండల వ్యాప్తంగా ఈ నెల 26వ తేదీ మహాశివరాత్రిని పురస్కరించుకొని జరగబోయే శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి చింతల బయ్యారం, సీతంపేట శివాలయాలు ముస్తాబవుతున్నాయి. ముఖ్యంగా పాత రెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని చింతల బయ్యారం గ్రామ సమీపంలోని గోదావరి నది తీరాన స్వయంభుగా వెలిసినటువంటి కాకతీయుల కాలం నాటి పురాతనమైన శ్రీ ఉమా నీల కంఠేశ్వర స్వామి ఆలయం సర్వసుందరంగా ముస్తాబైంది. సాంప్రదాయ బద్ధంగా మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. తెల్లవారుజామున 4గంటల నుండి భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరిస్తారు. ఆరు గంటల నుండి అభిషేకాలు పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఈ కళ్యాణ మహోత్సవ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీ ఉమా నీలకంటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటుంటారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో ఆలయ కమిటి వారు ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలంకరణ భారీ ఎత్తున చేస్తున్నారు. దేవతా మూర్తుల విద్యుత్ కటౌట్లు ఏర్పాటు చేస్తున్నారు. కళ్యాణ మహోత్సవంలో భాగంగా చివరి రోజు నిర్వహించే అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారి ఊరేగింపునకురథోత్సవానికి సుందరంగా పల్లకిని మెరుగులుదిద్దుతున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ పరిసరాలను పరిశుభ్ర పరుస్తూ, సర్వసుందరంగా తీర్చిదిద్దుతున్నారు. భక్తుల కోసం చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా గోదావరి నదిలో లోతు ప్రదేశం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గోదావరి దగ్గర స్నానమాచరించే వారికి ముఖ్యంగా మహిళలు ఎలాంటి అసౌకర్యాలకు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక స్నాన ఘట్టాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణకు పోలీస్‌లు, పంచాయతీ అధికారులతో సమన్వయంగా చర్యలు చేపట్టి వాహనాల పార్కింగ్ ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ పరిసరాల్లో పెద్దఎత్తున మంచి నీరు సదుపాయం, మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అంతే కాకుండా వైద్య ఆరోగ్య శాఖ అత్యవసర చికిత్స నిమిత్తం ప్రత్యేక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. చింతల బయ్యారం ఆలయ కమిటీ, అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపడుతున్నారు.

## రంగరాజన్‌పై దాడి కేసులో తల్లాడకు చెందిన నలుగురు అరెస్టు

ప్రజాపక్షం/ తల్లాడ : హైద్రాబాద్ చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ దాడి ఘటనలో తల్లాడ మండలానికి చెందిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. అంజనాపురం గ్రామానికి చెందిన భూక్యా శ్రీను, అంకోలు శిరీష, వెంకట్రామునితండాకు చెందిన భూక్యా గోపాల్‌రావు, నారయ్యబంజరకు చెందిన బానోత్ బేబీరాణిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# తాగునీటినందించండి మహాప్రభో..!

- భగీరథ లీకులతో అవస్థలు
-పట్టించుకోని మున్సిపల్ అధికారులు







ప్రజాపక్షం/పాల్వంచ : ప్రజలపై పగబట్టిన వైరస్‌లు ఎప్పుడు ఏ రూపంలో దాడి చేస్తాయో తెలియని పరిస్థితి. ఏ వ్యాధి ఏ రూపంలో విజృంభిస్తుందో అర్థం కావడం లేదు. ప్రజలకు ఎటువంటి అపాయం జరగకుండా వ్యాధులు సోకకుండా చూసుకోవలసిన అధికారులే ఇక్కడ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చెప్పి..చెప్పి.. నోరు నొప్పి అన్నట్లు అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న, తమని కాపాడండి మహాప్రభో అంటూ వేడుకున్న పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని ఏ రహదారి చూసిన భగీరథ పైప్ లైన్ల లీకులే.. ఆ లీకులను అధికారులు చూసుకుంటూ పోతారే తప్ప మరమ్మతులకు మాత్రం ఉపక్రమించడం లేదు. నల్లాలు వచ్చినప్పుడు లీకులగుండా బయటికి వచ్చిన నీరు అవి బంద్ అయ్యాక తిరిగి లీక్ అయిన రంధ్రాల గుండా పైపుల్లోకి చేరి తిరిగి పంపులు వచ్చినప్పుడు ఇంకిన మురుగు నీరే సరఫరా అవుతుంది. అయినా పట్టించుకునే నాథుడే లేదు. లీకుల వద్ద చేరిన నీటిలో పందులు, కుక్కలు తొర్లాడుతూ ప్రజలను అనారోగ్యాల పాలు చేస్తున్న అధికారులు మాత్రం ఆంటిముట్టనట్లే ఉంటున్నారు. అంటే ప్రజల ప్రాణాలు అంటే వారికి ఎంత ప్రేమ ఉందో ఇట్టే అర్థం చేకుకోవచ్చు. ఇది పాల్వంచ మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం. లీకుల ద్వారా కలుషిత నీటి సరఫరాతో అతిసార సోకే ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ అధికారులకు మాత్రం చీమకుట్టినట్లయినా లేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ మున్సిపాలిటీ మిషన్ భగీరథ పైప్ లైన్‌ల పరిస్థితి. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ చూసిన భగీరథ పైప్ లైన్లు లీకై నీరు వృధాగా పోతున్న పట్టించుకునే నాథుడే లేడు. ప్రతి రోజు ఏదో ఒక సమయంలో అధికారులు ఆ లీకులను చూసుకుంటూ వెళ్తున్నారే తప్ప మరమ్మతులు మాత్రం చేయించడం లేదు. పంపులు వచ్చిన క్రమంలో పైపులైన్ల ద్వారా లీకైనా నీరు బయటికి వృధాగా పోవడంతో పాటు పంపులు బంద్ అయ్యాక తిరిగి మురుగు నీరు పైపులలోకి చేరి ఆ నీరే సరఫరా అవుతుంది. ఈ మురుగు నీటి వల్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్న ఆ..మాకెందుకులే అని అధికారులు అనుకుంటున్నారనెందుకు ఎక్కడ చూసిన పైప్ లైన్ల లీకులే నిదర్శంగా చెప్పవచ్చు. మురుగునీటి సరఫరా వల్ల అనారోగ్యాల పాలవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మురికి నీటి సరఫరా వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. అసలే ఎండలు ముదురుతున్నాయని, ఇటువంటి పరిస్థితిల్లో లీకుల ద్వారా నీరు వృధాగా పోతుండడం వల్ల ఇండ్లలో నీటి అవసరాలు తీరక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ప్రజలు వాపోతున్నారు. తాగేందుకు కూడా నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, నల్లాల ద్వారా సరఫరా అవుతున్న మురుగునీటినే అవసరాలకు వాడుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ ప్రజలు రోడ్ల ప్రవహిస్తున్న నీటి వల్ల విద్యార్థులు, పాదచారులు, వాహన చోదకులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు ప్రజలు. లీకుల వల్ల మున్సిపాలిటీ ప్రజలకు ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకముందే సంబంధింత అధికారులతో పాటు జిల్లా అధికారులు స్పందించాలని, మున్సిపాలిటీ వ్యాప్తంగా లీకులకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## పాలేరు బస్ స్టేషన్‌ను విస్మరించిన ఆర్టిసి అధికారులు..!



ఆకతాయిలకు ధూమపాన కేంద్రంగా ఆర్టీసీ బస్టాండ్

ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని పాలేరు ఆర్టీసీ బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారింది అని చెప్పడంలో బస్టాండ్ లో ఉన్న దుర్గంధం అపరిశుభ్రత చెబుతుంది. ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల కోసం ప్రయాణికుల ఇబ్బందులు తీర్చడానికి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన బస్ స్టేషన్ అబాసు పాలవుతుందని చెప్తున్నారు. ప్రయాణికులు ఎంతో కాలం నుండి మూత్రశాలలు నిర్మించి ఉన్నప్పటికీ వాటిని ఆర్టీసీ అధికారులు నిర్వహించకపోవడం వల్ల మహిళా ప్రయాణికులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. అంతేకాకుండా బస్సుల కోసము వేచి ఉండాల్సిన పరిస్థితిలో గ్రామంలోని కొందరు యువకులు ఆకతాయిలు బస్టాండ్ నే కేంద్రంగా చేసుకుని సిగరెట్లు బీడీలు తాగుతూ అపరిశుభ్రతను నెలకొల్పుతున్నారు. గంటల తరబడి అక్కడే వేచి ఉండడంతో కొందరు మహిళా ప్రయాణికులు బస్టాండ్కు రావడానికి జంకుతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ఆర్టీసీ బస్టాండ్ బీడీ ముక్కల చెత్త కేంద్రంగా ఉన్నది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి మహిళా ప్రయాణికులకు సౌకర్యవంతంగా పారిశుద్ధ పనులను చేపట్టాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

**ఖమ్మం ఆర్టీసీ డీఎం దినేష్ కుమార్ వివరణ**

పాలేరు ఆర్టీసీ బస్టాండ్ లో అపరిశుభ్రత మూత్రశాల నిర్వహణపై కూసుమంచి ప్రజాపక్షం విలేకరు అడిగిన విషయంపై వివరణ ఇస్తూ అతి త్వరలోనే బస్టాండ్ లో సందర్శించి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

## హ్యాట్రిక్ విజయం సాధించిన సాయిస్ఫూర్తి విద్యార్థులు

ప్రజాపక్షం/సత్తుపల్లి: మండల పరిధిలోని గంగారంలో గల సాయి స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నికల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తా చాటి హ్యాట్రిక్ విజయంతో సౌత్ జోన్ పోటీలకు ఎంపికయినట్లు ప్రిన్సిపాల్ డా. ఊటుకూరి శేషారత్నకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11, 12న రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడలు జవహర్ లాల్ నెహ్రు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల రామంతపూర్ హైదరాబాద్ లో జరగాయని, ఈ పోటీల్లో పది జిల్లాల నుంచి విజయం సాధించిన జట్లు పోటీల్లో పాల్గొనగా సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నికల్ విభాగం విద్యార్థులు గతంలో జిల్లా స్థాయిలో విజయం సాధించి, రాష్ట్రస్థాయికి ఎంపికై, గురువారం రాష్ట్రస్థాయి వాలీబాల్ ఫైనల్ లో అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల కోదాడపై విజయం సాధించి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారని తెలిపారు. తమ కళాశాల పాలిటెక్నికల్ విభాగం విద్యార్థులు గత మూడు సంవత్సరాల నుండి ఫైనల్ కు వెళ్లి రెండు సంవత్సరాలు ప్రథమ స్థానం, ఒకసారి ద్వితీయ స్థానం సాధించడం జరిగిందని తెలియజేశారు. అంతే కాకుండా తమ కళాశాల విద్యార్థులు వచ్చే నెలలో జరిగే సౌత్ జోన్ క్రీడా పోటీలకు తెలంగాణ వాలీబాల్ టీం జట్టు తరఫున తమ కళాశాల విద్యార్థులు ముగ్గురు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ దేశిరెడ్డి రఘుపతి రెడ్డి, కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల హెచ్ఓఎస్‌లు, డిపార్ట్ మెంట్ ఫ్యాకల్టీ మెంబర్స్, సిబ్బంది పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులను అభినందించారు.



## 20న జరిగే ఛలో హైదరాబాద్ జయప్రదం చేయండి



ప్రజాపక్షం/పాల్వంచ : పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, సీతారామ ప్రాజెక్టు నీళ్లను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ మండలాలకు ఇచ్చాకే బయటకు తరలించాలని డిమాండ్ చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికై ఈ నెల 20న జరిగే ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ పాల్వంచ పట్టణ పరిధిలోని అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.సీతారామయ్యలు మాట్లాడుతూ..సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెల 20న జరిగే ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి ఆదివాసీ గిరిజనులు, ప్రజలు, కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, వై.శ్రీను, రాజేష్, మల్లేష్, బుర్ర వెంకన్న, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవిపై అవగాహన సదస్సు



ప్రజాపక్షం/మణుగూరు: తెలంగాణ గవర్నమెంట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు ది గాడ్ తెరిసా మహిళా మండలి సంస్థ ద్వారా మణుగూరు మండలం తోగూడెం, మినీ మేడారం జాతర నందు హెచ్ఐవి మీద అవగాహన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ఐవి వచ్చే మార్గాలు మరియు నివారణ మార్గాల గురించి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రాజెక్ట్ మేనేజర్ వట్టి సాగర్ రెడ్డి అవగాహన కల్పిస్తూ హెచ్ఐవి అనేది నాలుగు మార్గాల ద్వారా వస్తుందని, హెచ్ఐవి సోకిన వాళ్ళతో కండోమ్ లేకుండా సెక్స్ చేయటం వలన, హెచ్ఐవి తో ఉన్న వ్యక్తి వాడిన సూదులు వాడడం ద్వారా, హెచ్ఐవి ఉన్న తల్లి నుంచి బిడ్డకి, హెచ్ఐవి వచ్చిన వాళ్ళ రక్తం ఎక్కించుకోవడం ద్వారా వస్తుందని వివరంగా తెలిపారు. అలాగే హెచ్ఐవి ఉన్న వాళ్ల మీద వివక్ష చూపించకూడదని, చూపుతే 2017 యాక్ట్ ప్రకారం చట్టరీత్యాలు తీసుకుంటారని చెప్పారు. అలాగే మీకు ఏదైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1097 కి ఫోన్ చేసి సలహాలు సూచనలు తీసుకోవచ్చన్నారు. మీ వివరాలు కూడా చాలా గోప్యంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎన్ఎం రాణి, అవుట్రీచ్ వర్కర్ నాగభూషణం, సుజాత, ఉష, రజిని, జయలక్ష్మి, ప్రభావతి, కుమారి, నాగేంద్ర మేరీ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా న్యాయమూర్తిపై దాడి పట్ల మణుగూరు న్యాయవాదుల తీవ్ర నిరసన



ప్రజాపక్షం/మణుగూరు: రంగారెడ్డి జిల్లా కోర్టులో 9వ అదనపు మహిళా న్యాయమూర్తిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ మణుగూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు బహిష్కరించి, నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేదరమట్ల శ్రీనివాసరావు, చీర్రా సరస్వతి, దాసరి కవిత, అంకం సర్వేశ్వరరావు, కామసాని వీర మధుసూదన్, రుద్రా వెంకట్, కందిమల్ల నరసింహారావు, నిమ్మను కోటి సావిత్రి, కూర్మా విజయ రావు, జాడి చుక్క రావు, పోశం భాస్కరరావు, నాగార్జున రెడ్డి, రమేష్, మోహన్ సాయి, సునీత, సుస్మిత, సాంబ, బిక్కసాని శ్రీనివాస్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు. న్యాయ వ్యవస్థకు అండగా నిలవాల్సిన సమాజంలో, న్యాయమూర్తులపై ఇలాంటి దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, దోషులకు కఠిన శిక్ష విధించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు.

## గొప్ప మనసు చాటుకున్న తహశీల్దార్





ప్రజాపక్షం/మణుగూరు: పెద్దిపెల్లి గ్రామానికి చెందిన పొడియం దేవా ఇటీవల తీవ్ర రోడ్డు ప్రమాదానికి గురై కాలు విరిగిపోయింది. అతను హాస్పిటల్‌లో చేరినా, ఆరోగ్య శ్రీ కార్డు లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులు వల్ల ఆపరేషన్ చేయించుకునే అవకాశం లేకుండా పోయింది. వైద్యులు అతని కాలి శస్త్రచికిత్స కోసం 90,000 ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మణుగూరు మండల తహశీల్దార్ రాఘవరెడ్డి మానవతా ధృక్పథంతో స్పందించి, స్వంత డబ్బులతో అతన్ని హైదరాబాద్‌కు పంపించి, ఆరోగ్య శ్రీ ద్వారా ఉచిత వైద్యం పొందేలా చర్యలు తీసుకున్నారు. తహశీల్దార్ చొరవతో దేవాకు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించబడింది. ప్రస్తుతం అతని ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోంది. తహశీల్దార్ రాఘవరెడ్డి మానవీయ స్పందన పట్ల గ్రామస్థులు, దేవా కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇలాంటి మంచి అధికారులే సమాజానికి అవసరం అని ప్రశంసించారు. పేదవాళ్ల కష్టాలను చూసి వెనుకంజ వేయకుండా, తన సొంత డబ్బులతో సహాయం చేసి ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స అందించడానికి ప్రయత్నించడం తహశీల్దార్ గొప్ప మనసు.

# ఆర్థిక స్వతంత్రతతోనే మహిళా సాధికారత




**-కొత్త కొత్త విషయాలను నేర్చుకోవాలి**
**-నైపుణ్య శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలి**
**-శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఆర్థిక స్వతంత్రతతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా రెండు రోజుల పాటు జిల్లాలోని ఐదు నియోజక వర్గాల గ్రామీణ మహిళ వ్యాపారవేత్తలు, సెర్ఫ్ సిబ్బందికి చిన్నతరహా వ్యాపారాల నైపుణ్యాభివృద్ధిపై ఖమ్మంలోని శ్రీ భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొదటి రోజు మధిర, సత్తుపల్లి అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక బలం, ఆర్థిక స్వతంత్రత ఉంటేనే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం వల్ల కుటుంబాలు బాగుపడతాయని, పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు మహిళలకు ధైర్యం ఉండాలని, ప్రారంభంలో మనకు వంద రకాల సందేహాలు, భయాలు ఉంటాయని వీటిని అధికమిస్తూ కొత్త కొత్త విషయాలను నేర్చుకుంటూ వ్యాపారాలను చేయాలన్నారు. వ్యాపారాలు ఒకే రోజు విజయవంతం కావాని, వాటిని నడపడంలో నేర్పు, ప్రణాళిక ఉండాలన్నారు. ఏ వస్తువు అధికంగా వ్యాపారం అవుతుంది, ప్రస్తుతం ఉన్న మార్కెట్ పరిధిలో వ్యాపారాన్ని ఎలా పెంచుకోవాలి, మన లాభం మార్జిన్ ఎంత ఉంటుంది వంటివి ఆలోచించి అడుగులు వేయాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. వినియోగదారుల ఆలోచన సరళిని పరిశీలించి మన వ్యాపారాలు ఉండాలన్నారు. మన దగ్గర ఉన్న డబ్బును రెట్టింపు ఎలా చేయాలి అన్న ఆలోచన నిరంతరం ఉండాలన్నారు. జీవనోపాధి పెంపుదల, వ్యాపారాల నైపుణ్యాభివృద్ధికి అందించే శిక్షణా కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైతే అదనపు శిక్షణా కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఎఎల్ఈఏపి స్కిల్ డెవలప్‌మెంట్ ఛైర్‌పర్సన్ అన్నపూర్ణ మాట్లాడుతూ మహిళలకు ఉన్న అవకాశాల గురించి తెలుసుకుని పైకి ఎదగాలన్నారు. తల్లిగా పిల్లలను ఎలా జాగ్రత్తగా పెంచుతారో అదే రీతిలో మన వ్యాపారాలను కూడా బాధ్యతాయుతంగా నిర్వహించి దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలకు దోహదపడాలన్నారు. మహిళలకు పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సంపూర్ణ సహకరాలు అందిస్తామన్నారు. అనంతర గ్రామీణ వ్యాపారవేత్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, అడిషనల్ డిఆర్‌డివో నూరుద్దీన్, ఏఎల్ఈఏపి విజయవాడ రీజినల్ మేనేజర్ సునీత, ఐఓఎల్ ట్రైనర్ శివనారాయణ, సిహెచ్ రవీందర్, హైదరాబాద్ సెర్ఫ్ ప్రాజెక్టు మేనేజర్ శ్రావణ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సురక్షబీమా యోజన చెక్కు అందజేత



**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ మండలంలోని గోపాలపేట గ్రామానికి చెందిన పొన్నెకంటి నరసింహారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తల్లాడ బ్యాంక్‌లో సురక్ష బీమా యోజన లైఫ్ ఇన్సూరెన్స్‌కు చెల్లించుకున్నాడు. ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబ సభ్యునికి సురక్ష బీమా యోజన ద్వారా రూ.2లక్షలు చెక్కు మంజూరు కావడంతో ఆ చెక్కును శుక్రవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ గోపగోని లింగస్వామి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్న తల్లాడ మేనేజర్ ఫణికుమార్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, గోపాలపేట మాజీ సర్పంచ్ నల్లమోతు మోహన్‌రావు, అకౌంటెంట్ భీమరాజు, క్యాష్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, క్లర్క్ నాగరాజు, సురేష్, బోనాసి శ్రీనివాసరావు నల్లగట్ల నరేష్ పాల్గొన్నారు.

# అబ్దుల్ కలామ్ కళాశాలకు నాక్ బి++ గ్రేడ్



**ప్రజాపక్షం/సుజాతనగర్:** బెంగుళూరు లోని నాక్ కేంద్ర కార్యాలయం వారు గురువారం విడుదల చేసిన ఫలితాలలో మండలం లోని వేపలగడ్డ నందు అబ్దుల్ కలామ్ ఇంజనీరింగ్ కళాశాలకు నాక్ బి++ గ్రేడ్ గుర్తింపు సాధించిందని కళాశాల ఛైర్మన్ దోసపాటి వెంకటేశ్వరరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చావా లక్ష్మి నారాయణ తెలిపారు. శుక్రవారం కళాశాల నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గత కొన్ని రోజుల క్రితం నాక్ బృందం కళాశాలను పర్యటించి కళాశాల నందు వసతులు నాణ్యత ప్రమాణాలు సాధించిన ప్రగతి, అధ్యాపకులు విద్యార్థులు సాధించిన ప్రగతి తదితర అంశాలను పరిశీలించి కళాశాలకు నాక్ బృందం నాలుగు పాయింట్లు గాను 2.92 సిజిపిఏ తో బి++ గ్రేడ్ 5 సంవత్సరాల కాలానికి చెల్లుబాటు అయ్యేలా గుర్తింపును ఇచ్చారన్నారు. కళాశాల నందు రానున్న రోజుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. నాక్ గుర్తింపు వచ్చేందుకు కృషి చేసిన సిబ్బందిని, విద్యార్థినీ విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దయాకర్, నాక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, రమేష్, శ్రీకాంత్, సైదయ్య, బాబురావు, లక్పతి, చిరంజీవి, హెచ్‌ఓడీలు మునీర్, కృష్ణమోహన్, రవికిరణ్, వినోద్ అయూబ్, అంబిక, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై ఆర్‌డివో సమీక్ష సమావేశం



**ప్రజాపక్షం/వైరా :** వైరా మండలం స్నానాల లక్ష్మీ పురం శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం ఖమ్మం ఆర్‌డివో గరిడి నర్సింహారావు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల26 నుండి జరుగు మహాశివరాత్రి జాతర పార్వతిపరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం ఏర్పాట్లకు సంబంధించి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష ఆయన ప్రత్యేకంగా వారిగా సమావేశం నిర్వహించారు. ఈస ందర్భంగా ఆర్‌డివో గరీబ్ నరసరాలు మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అన్నారు. అనంతరం గరిడి నర్సింహారావు మహా శివరాత్రి జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎంపిడివో సరస్వతి, డిప్యూటి తహశీల్దార్ సురేష్‌బాబు, ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్, ఈవో హరి చంద్రశేఖర్, ఎంపివో జ్యోత్స్నదేవి, పంచాయతీ కార్యదర్శి ఆర్.భారతి, ఎక్సైజ్ ఆర్‌టివో ఇరిగేషన్ వైద్య అధికారులు, స్థానిక నాయకులు దొడ్డా పుల్లయ్య, మల్లు రామకృష్ణ, నూతి వెంకటేశ్వరరావు, అడుసుమల్లి గణేష్, పొట్లపల్లి నాగేశ్వరరావు, మొగునూరి సత్యనారాయణ, గిరగాని శ్రీనివాసరావు, తలారి నర్సింహారావు, సంగెపు రామకృష్ణ, సుల్తాన్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

# వేతనాలు లేక సిబ్బంది విలవిల



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండలంలో 1962 పశు సంచార వైద్య సేవలు అందిస్తున్నటువంటి సిబ్బందికి గత కొంత కాలంగా వేతనాలు లేక కుటుంబ జీవనాలు సాగించలేక విలవిలలాడుతున్నారు. మన తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 100 వాహనాలు పశువులకు వైద్య సేవలు అందిస్తున్నాయి. ప్రతి నియోజకవర్గానికి ఒక వాహనం చొప్పున నడిపిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు కొన్ని వేల మూగజీవాల ప్రాణాలు కాపాడగలిగారు కానీ గత కొన్ని నెలలుగా సిబ్బందికి వేతనాలు లేక కుటుంబ పోషణ కూడా ఇబ్బంది మారింది. ఎందుకంటే 1962 సేవలకు గత కొన్ని నెలలుగా ప్రభుత్వం నుండి రావలసిన నిధులు విడుదల కాలేదంటున్న యాజమాన్యం. ప్రభుత్వం నుండి అందవలసిన నిధులు 15 నెలలుగా జాప్యం జరగడం వల్ల యాజమాన్యం జీతాలు సరైన సమయంలో ఇవ్వలేకపోతున్నారు. యాజమాన్యమే తమ సొంత ఖర్చులతో సిబ్బందికి జీతభత్యాలు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులు త్వరగా విధుల చేయాలని సిబ్బంది ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు.

# యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

**-సారపాకలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం**




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** యువత క్రీడాల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సారపాక గ్రామ పంచాయితీ మాజీ సర్పంచ్ ధరావత్ చందునాయక్ అన్నారు. శుక్రవారం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా సారపాకలోని రాజీవ్‌నగర్ క్రికెట్ గ్రౌండ్‌లో 2025 సూపర్ బి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్యఅతిథి హాజరై, ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పెంపొందిస్తాయని అన్నారు. సమాజంలో ఇప్పుడు యువకుల సాంద్రత ఎక్కువగా వుందని, యువత చేడు మార్గాలలో ప్రయాణించకుండా ఉండటానికి ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహించాలని అన్నారు. బూర్గంపాడు మండల స్థాయిలో నిర్వహిస్తున్న క్రికెట సూపర్ బి 2025కు విశేష ఆదరణతో యువకులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని అట్టహాసంగా టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌కు మొదటి బహుమతి ధరావత్ చందునాయక్, రెండవ బహుమతి పాకాల దుర్గాప్రసాద్ అందించారు. ఈకార్యక్రమాన్ని సారపాక సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ సారపాక కమిటీ సభ్యులు గుగులోత్ రాంబాబు, నుణావత్ నరేష్, చంద్ర, శంకర్, రంజిత్, ఏసు, చందర్, రఘు, విక్రమ్, గ్రామ పెద్దలు బర్మావత్ కిషన్, రాంబాబులు నిర్వహించారు.

# మూడు ప్రభుత్వ కొలువులు.. ఒక డాక్టరేట్ సాధించిన యువకుడు



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండలం రాజపురం గ్రామానికి చెందిన దావా వేణు ఉస్మానియా యూనివర్సిటీలో కామర్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ జి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఇంపాక్ట్ ఆఫ్ ఫ్యూచర్ వోలటాలిటీ ఆన్ ఈక్విటి మార్కెట్ విత్ రిఫరెన్స్ టు ఎన్‌యస్ఇ ఇండియా ఎస్టడి అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి గౌరవ డాక్టరేట్ పట్టాను ఉస్మానియా యూనివర్సటి అధికారుల సమక్షంలో పట్టా తీసుకున్నట్లు దావా వేణు తెలిపారు. . ఈసందర్భంగా ఆయనకు పలువురు ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ అధ్యాపక బృందం, మహాత్మాగాంధీ బాపులే కళాశాల ప్రిన్సిపాల్ బురాన్, అధ్యాపక బృందం, పలువురు గ్రామ ప్రజలు, మిత్రులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

# రెండు రోజులు ప్రభుత్వ సెలవు దినాలుగా ప్రకటించాలి



**ప్రజాపక్షం/కామేపల్లి:** రాష్ట్రంలో మేడారం జాతర తర్వాత అతిపెద్ద జాతర సూర్యాపేట జిల్లా కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో గల దురాజ్‌పల్లి గ్రామంలో జరుగు గొల్లగట్టు లింగమంతుల స్వామి జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించి రెండు రోజుల ప్రభుత్వ సెలవు దినాలుగా ప్రకటించాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షులు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పండితాపురం గ్రామంలో జరిగిన మండల యాదవ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ గొల్లగట్టు లింగమంతుల జాతర అతి పురాతనమైనదని, దాదాపు 1000 సంవత్సరాలకు పైగా జాతర నడుస్తున్నట్లు, నాటి కళ్యాణి చాళుక్యులు 11వ శతాబ్దంలో గిరిదుర్గంపైన జాతర ప్రారంభించినట్లు శాసనాల ద్వారా తెలుస్తుందని, శివుడిని లింగమంతుల స్వామిగాను, చౌడమ్మను శక్తి రూపిణిగా భావించి ఉంద్రకొండపై రెండు గుడులను కట్టి జంతు బలితో నైవేద్యం చేస్తూ జాతర ప్రారంభించబడుతుందన్నారు. ఈ పండుగను కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే ప్రకటించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మేకల మల్లికార్జునరావు, జాల శ్రీనుయాదవ్, జక్కుల బ్రహ్మయ్య, సత్తి చిట్టిబాబు, కేతబోయిన రాంబాబు, మేకల అశోక్, చిన్నపోయిన సత్యం, చిన్నబోయిన కృష్ణ, కానబోయిన బిక్షం, కానబోయిన వెంకట రాములు, అల్లిక బక్కయ్య, సత్తి వీరబాబు, మంద నాగేశ్వరరావు, ,చింతల వెంకయ్య, ఎర్రగడ్డ రామచంద్రయ్య, మేకల మహేష్, లాల్ కృష్ణ, మలాది వెంకన్న, మల్లాది లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలి



### - గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం / భద్రాచలం :** ఇల్లందు మండల పరిధి రొంపేడు గ్రామంలో గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీలతో ముచ్చటిస్తూ వారికి అందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్, క్లాస్ రూమ్‌లు, పరిసరాలు, స్టోర్స్, వంట గదులను తనిఖీ చేసి సమస్యలను అడిగి స్వయంగా రాసుకున్నారు. ఈ తనిఖీలో భాగంగా తరగతి గదిలో విద్యార్థినీలతో మమేకమై విద్యార్థులు ఎలా చదువుతున్నారు? టీచర్లు పాఠాలు ఎలా చెపుతున్నారు? పాఠ్యాంశాల బోధన పట్ల అవగాహన కలుగుతుందా? మీరు ఎంచుకున్న లక్ష్యాలు ఏమిటి? మోనూ ఎలా ఉంది? అని తదితర విషయాలపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థినీలు చదువుపై శ్రద్ధ చూపి ఉన్నత శిఖరాలను అవరోధించాలని, వసతి గృహంలో కానీ పాఠశాలలో కానీ ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..పిల్లలకు స్వచ్ఛమైన, రుచికరమైన ఆహారం అందించాలని, ఆహారం వన్డే సిబ్బంది పరిశుభ్రంగా చేతులు కడుక్కొని ఆహార పదార్థాలను సిద్దం చేయాలన్నారు. స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని, నిరంతరం విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని, ప్రతి విద్యార్థినీకు వ్యక్తిగత, పరిశుభ్రత, మానసిక వికాసం కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని గమనిస్తూ అవగాహన కల్పించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతి సబ్జెక్టుపై ఎలాంటి సందేహాలు ఉన్న సమాధానాలు చెబుతూ విద్య బోధనలు అందించాలని సూచించారు. వసతి గృహాలలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిత్యం గమనిస్తూ ఉండాలని ఆదేశించారు. విద్యార్థులు సౌకర్యవంతంగా చదువుకోవటానికి అన్ని సదుపాయాలు కల్పించాలని, దానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ తనఖీలో కలెక్టర్ వెంట ఇల్లందు తహసీల్దార్ రవికుమార్, హాస్టల్ వార్డెన్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అసమర్థ పాలనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు..



### ఎమ్మెల్సీ తాతా మధు సమక్షంలో కాంగ్రెస్ నుంచి 30 కుటుంబాలు బిఆర్ఎస్‌లో చేరిక

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయకుండా ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిప్పుతూ సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నారని, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ తాత మధు అన్నారు. మండల పరిధిలోని జల్లేపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదరి వీరస్వామి, అన్నపర్తి పరశురాం, సురేష్ 30 కుటుంబాల కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్సీ తాత మధుసూదన్ సమక్షంలో ఖమ్మం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వల్ల పెను ప్రమాదం రాష్ట్రానికి కలుగుతుందని ప్రజలు భావించి 14 నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల నమ్మకం కోల్పోయి కేసీఆర్ సమక్షంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, భావించి బీఆర్ఎస్ పార్టీలో చేరారని ఆయన అన్నారు. పార్టీలో చేరిన వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ ఎల్లప్పుడూ పార్టీ కార్యకర్తలను నాయకులను కాపాడుకుంటామని కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో బిఆర్ఎస్ కార్యకర్తల పై పోలీసులు అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని ఆయన అన్నారు. పోలీసులు అక్రమ కేసులు బనాయించడం మానుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలయపాలెం మండలం అధ్యక్షుడు బాషబోయిన వీరన్న, రూరల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణు, దీవల శ్రీనివాసరావు, పోట్ల జగదీష్, పోట్ల నాగేశ్వరరావు, అనపర్తి ఉప్పలయ్య, అన్నపర్తి ఎల్లయ్య, సందర బోయిన పాపారావు, ఇండ్ల సురేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఐదో రోజుకు చేరిన రిలే దీక్షలు

### అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపిన గ్రామస్తులు




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి సైలో బంకర్ నుంచి వెలువడుతున్న కాలుష్యం నుండి తమను కాపాడాలని కోరుతూ, తక్షణమే తమకు పునరావాసం ఏర్పాటు చేయాలని నిలదీస్తూ కిష్టారం గ్రామంలోని అంబేద్కర్ నగర్ బీసీ కాలనీల ప్రజలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఐదో రోజు కార్యక్రమంలో భాగంగా ఆయా కాలనీల ప్రజలు రాష్ట్రీయ రహదారిపై అర్ధనగ్న ప్రద ర్శనతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ఆందోళనలకు దిగిన ప్రతిసారీ సమస్యను పరిష్కరిస్తా మంటూ సింగరేణి అధికారులు కల్లబొల్లి మాటలు చెబుతూ కాలక్షేపం చేస్తున్నారని , వారి మాటలు నమ్మిన తాము ఆరోగ్యాలను పాడు చేసుకుని, ప్రాణాలు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి అధికారుల మాటలను ఇంత కాలం నమ్మామని, ఇక నమ్మే పరిస్థితిలో తాము లేమని, అధికారులు, రాజకీయ నాయకుల మాటలు వట్టి నీటి మూటలేనని తేలిందని న్యాయం జరగకుంటే ఇక రణమేనని హెచ్చరించారు. సింగరేణి ఆటలు సాగవని, ఇక ఉపేక్షించేది లేదని, తాడోపేడో తేల్చుకొనేవరకు ప్రాణాలను సైతం లెక్క చేయమని అంబేద్కర్ నగర్, బీసీ కాలనీ సైలో బాధితులు స్పష్టం చేస్తున్నారు. భారీగా ట్రాఫిక్ జాంసైలో బంకర్ బాధితులు చేపట్టిన ఆందోళనతో రాష్ట్రీయ రహదారిపై భారీ ఎత్తున ట్రాఫిక్ జాం జరిగి వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న సత్తుపల్లి సీఐ కిరణ్, ఎస్సైలు కవిత, వీరేందర్‌లతో చేరుకుని బాధితులతో మాట్లాడి రాస్తారోకో విరమింపజేశారు. అనంతరం కిష్టారం పిఓ నరసింహారావు దీక్ష శిబిరం వద్దకు చేరుకుని బాధితులతో మాట్లాడుతూ సమస్యను ఉన్నతస్థాయి అధికారుల వరకు తీసుకెళ్లామని, సమయం ఇస్తే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఇందుకు బాదితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు రిలే దీక్షలు ఆపే ప్రసక్తే లేదన్నారు. కిష్టారం, జేవీఆర్ ఓసీల్లో అన్ని రకాల పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

# బిజెపి అభ్యర్థి పులి సర్వోత్తమ్ రెడ్డి గెలుపు కోసం పనిచేయాలి

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ శాసనమండలి భారతీయ జనతా పార్టీ అభ్యర్థి పులి సర్వోత్తమ్ రెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ కోరారు. శుక్రవారం జూలూరుపాడు బిజెపి మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో చిలుకూరి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మీద ప్రజలు, అన్ని వర్గాల వారు తీవ్రమైన వ్యతిరేకతతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మాదినేని సతీష్, జిల్లా నాయకులు తెల్లం నరసింహారావు, నున్న రమేష్, బిజెపి మండల అధ్యక్షుడు సిరిపురపు ప్రసాద్, బిజెపి మండల కార్యదర్శి భూక్య రమేష్, సిరిపురపు గోపాల్ రావు, నర్వనేని కృష్ణ, పురేటి వెంకటేశ్వర్లు, పుల్లారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో కొనసాగుతున్న పుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో పుట్‌పాత్ ఆక్రమణలు తొలగింపు కార్యక్రమం కొనసాగుతుంది. గత రెండు రోజులుగా వైరా మున్సిపాలిటీలోని మధిర రోడ్డు ఖమ్మం రోడ్డుకు ఇరువైపులా డ్రైన్‌లు దాటి ఆక్రమించుకున్న ఆక్రమణలను మున్సిపాలిటీ అధికారులు సిబ్బందితో కలిసి తొలగింపు కార్యక్రమాలను చేపట్టారు. దీంతో వైరాలోని రోడ్లు ఆక్రమణ తొలగించేటప్పటికి విశాలంగా కనిపిస్తున్నాయి. స్థానిక రింగు రోడ్డు నుండి ఎటుచూసినా రెండు ప్రక్కల రోడ్ల ఆక్రమణలు తొలగించడంతో వైరా పట్టణం ఇరువైపులా కనిపిస్తుంది. ఇదేవిధంగా రోడ్లు ఆక్రమణల పట్ల అధికారులు నిర్ణయాలు ఉంటే రోడ్లపై ఆక్రమణలు మరెవ్వరూ చేపట్టారు.

# ముస్లిం ఐక్య సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో ఎర్రుపాలెం మస్జిద్ నందు అధ్యక్షులు జనాబ్ షేక్ ఇస్మాయిల్ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ సమావేశంలో మండల శాఖ కోశాధికారి జనాబ్ షేక్.నాగుల్‌మీరా, సభ్యులు షేక్. మహబూబ్ సుభాని, జాని, బాజీ, షరీఫ్, మౌలాలి, నౌషద్, అహ్మద్, ఖాజా మొహినుద్దీన్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టుపురుగుల పెంపకంపై అవగాహన



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండలంలోని లక్ష్మీ పురం గ్రామంలో మామిడి, ఆయిల్‌ఫామ్, పట్టుపురుగుల పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ ఆయిల్‌ఫామ్‌తోటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జిల్లా పట్టుపురుగులశాఖ అధికారి ముత్యాలు పట్టుపురుగుల పెంపకం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం వైరా ఉద్యన శాస్త్రవేత్త డాక్టర్ వి.చైతన్య మామిడి పూత, పిందె సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల యాజమాన్యం, పోషకాల ఆవశ్యకతపై వివరించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం వైరా ప్రొగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ పాల్గొన్నారు.

# గౌతమి నగర్ కాలనీని సందర్శించిన డిఎస్‌పి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండల పరిధిలోని భారజల కర్మాగారం గౌతమి నగర్ కాలనీని మణుగూరు డిఎస్‌పి రవీందర్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా భారజల ఉద్యోగులతో ప్రాపర్టీ అఫెన్సెస్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గౌతమినగర్ కాలనీలో సీసీ కెమెరాలు, పెట్రోలింగ్, పాయింట్ బుక్స్ ఏర్పాటు చేయడం, కొత్త వ్యక్తులకు పాసులు జారీ చేయడం లాంటి విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈకార్యక్రమంలో సీఐ, ఎస్ఐలు అశోక్‌రెడ్డి, తిరుపతిరావు, ఏఎస్ఓ రమణబాబు, డిఏవో తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండల కేంద్రంలోని గౌతమినగర్ కాలనీలో 39వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిస్ ఎనర్జీ(డిఏఈ) స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలు మానసిక ఉల్లాసానికి ఆరోగ్య సమస్యలకు దోహదపడతాయని అన్నారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు శుభాకాంక్షలు తెలియజేసి, ఓడిపోయిన వారు కూడా విజేతలతో సమానమేనని క్రీడలలో గెలుపు ఓటములు సహజమని ప్రతి ఒక్కరూ వాటిని హుందాగా తీసుకోవాలని అన్నారు. అనంతరం హెవీ వాటర్ ప్లాంట్ జనరల్ మేనేజర్ శర్మ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో డిజిఎంజి సీఏఓ శ్రీనివాసరావు, హెవీ వాటర్ ప్లాంట్ కో కన్వీనర్ రఫిక్ అహ్మద్, మెంబర్ సెక్రటరీ సిహెచ్ కోటేశ్వరరావు, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులు, హెవీ వాటర్ ప్లాంట్ గౌతమి నగర్ కాలనీ వాసులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మతల్లికి ఘనంగా పంచామృతాభిషేకం



**ప్రజాపక్షం / పాల్వంచ :** మండల పరిధి కేపీ, జగన్నాధపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి) లో శుక్రవారం అమ్మవారికి పంచామృతాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో దేవస్థాన అర్చకులు, భక్తులు జన్మస్థలం వద్ద ఉన్న అమ్మవారికి పంచామృతాలు, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించి అనంతరం దేవాలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం అనంతరం పంచ హారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పూజలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారిని ఎన్.రజనీకుమారి, భక్తులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.